సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామానికి చెందిన రజిని అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితులు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 42000 మంజూరు అయ్యింది. మంగళవారం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. మూడుచింతలపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, నాయకులు సంజీవ్‌యాదవ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో..



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌ల ఆధ్వర్యంలో 26వ డివిజన్ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరిఅంజిరెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్పొరేటర్ భీమ్‌రెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు మాడుగుల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర గంగా నీరు సరఫరా



గంగానీటి బాటిళ్లను ఉచితంగా అందజేస్తున్న బీజేపీ నల్లవెంకట్‌రెడ్డి తదితరులు

కీసర: పవిత్ర గంగా నీటిని కీసర తపాలా కార్యాలయం (పోస్టుఆఫీస్)నుంచి విక్రయించడం జరుగుతుందని కావాల్సిన వారు రూ. 30 చెల్లించి అరలీటర్ బాటిల్‌ను కొనుగోలు చేసుకోవచ్చని బీజేపీ నేత వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం కీసర తపాలా కార్యాలయానికి విచ్చేసిన ప్రజలకు తన స్వంత డబ్బులను వెచ్చించి కొనుగోలు చేసిన గంగా నీటి బాటిళ్లను ఉచితంగా అందజేశారు. పవిత్ర గంగానీటిని వివిధ పూజలకు వాడుకోవచ్చన్నారు.

ఉపాధ్యాయుల నిరసన దీక్ష



అత్వెల్లి పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మేడ్చల్: తపస్ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్మాగ్రహ దీక్షలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి, కరపత్రాలు ప్రదర్శించి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో తపస్ సంఘ నాయకులు నవీన్, వెంకటరమణ, గోపాల్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌ల ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ఎండీఏ, హెచ్ఎండబ్ల్యూఎస్,ఎస్‌బీ, ఎలక్ట్రిసిటీ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ కమిషనర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ భీమ్‌రెడ్డి నవీన్‌రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, పప్పుల అంజిరెడ్డి, యాసారం మహేష్, దేవేందర్‌గౌడ్, కృష్ణగౌడ్, ఈశ్వర్‌రెడ్డి, కో- ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డీఈ సాయినాథ్‌గౌడ్, టీపీఓ సుకన్య, కరెంట్ ఏఈ సత్యనారాయణ, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో ప్రజలు భాగస్వాములవ్వాలి

మల్లాపూర్: అవినీతి నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని బెల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మల్లాపూర్ పారిశ్రామికవాడలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ నవరత్న డిఫెన్స్ ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో నిఘా జాగృతి వారోత్సవాల సందర్భంగా అవినీతి నిర్మూలనపై బెల్ కంపెనీ నుంచి ఎలిఫెంట్ సర్కిల్, బెల్ సర్కిల్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అవినీతి నిర్మూలన ప్రజలందరి కృషితోనే సాధ్యమవుతుందన్నారు. నవంబర్ 3వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో దాదాపు 300 మంది ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆదాయం కోసం..

ఆర్టీసీ కొత్త మార్గాలు

కళాశాలల సమయాల్లో ఆర్డినరీ బస్సుల నిలిపివేత

- బస్టాండ్ నుంచి బయల్దేరుతున్న 10 బస్సులు
- 8 మెట్రో బస్సులు, 2 ఆర్డినరీ బస్సులు
- మెట్రోలో కాంబినేషన్ టికెట్‌పై వెళ్తున్న విద్యార్థులు
- బస్‌పాస్ ఉన్నప్పటికీ విద్యార్థుల అగచాట్లు

ఆర్టీసీ అధికారులు తమ లాభాపేక్షతో ఉదయం విద్యార్థుల సమయాల్లో ఆర్డినరీ బస్సులు నడపడం లేదు. పది బస్సులు బస్టాండ్ నుంచి బయలుదేరితే అందులో 8 మెట్రో బస్సులు ఉంటున్నాయి. రెండు ఆర్డినరీ సర్వీసులు ఉంటున్నాయి. మెట్రో సర్వీసులలో విద్యార్థులు ప్రయాణించాలంటే పాసు ఉన్నా పాసు చూపించి అదనంగా 10 రూపాయలు ఇస్తే కాంబినేషన్ టికెట్ తీసుకోవాలి. దీంతో విద్యార్థులకు నిత్యం పాస్ ఉన్నా అదనంగా రాను పోను రూ.20 రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. దీంతో తల్లిదండ్రుల జేబులకు చిల్లుపడుతోంది. అధికారులు విద్యార్థుల అవస్థలు దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల సమయాల్లో బస్ పాసులు చెల్లుబాటు అయ్యే ఆర్డినరీ సర్వీసులను నడపాలని డిమాండ్ చేస్తున్నారు.

రోజుకు 5వేల మంది వరకు..

మేడ్చల్ నుంచి మైసమ్మగూడ మల్లారెడ్డి యూనివర్శిటీ, ఇతర కళాశాలలకు, కండ్లకోయ సీఎంఆర్ కళాశాలలకు, ఇతర కళాశాలలకు, సుచిత్రలోని వివిధ కేటగిరిల్లో ఉన్న ఇంటర్, డిగ్రీ కళాశాలలకు, సికింద్రాబాద్ ఇతర ప్రాంతాల్లో ఉన్న కళాశాలలకు, సుచిత్ర వరకు వివిధ ప్రైవేటు పాఠశాలలకు నిత్యం వందల మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. మహిళా విద్యార్థులకు ఉచిత ప్రయాణం కావడం, రాష్ట్రేతర విద్యార్థులు హాస్టల్‌లో ఉండి చదువుకునే వారు ఎక్కువగా ఉండటంతో వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి.

అన్ని సర్వీసులను నడిపిస్తున్నాం..



ఏ సమయంలోనైనా అన్నీ బస్సులను నడిపిస్తున్నాం. ఆర్డినరీ బస్సులతో పాటు, మెట్రో బస్సులు, ఇతర బస్సులు అన్ని వేళల్లో నడుస్తున్నాయి. విద్యార్థుల సమస్యలను సైతం పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తాం.

– సుధాకర్, మేడ్చల్ డిపో మేనేజర్

> ఆర్టీసీని లాభాల బాటలో నడపాలని ఆ సంస్థ చేయని ట్రిక్కులు ఎన్నో ఉన్నాయి. సంస్థ అవలంభిస్తున్న కొన్ని అనవసర ఆలోచనలతో విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. మేడ్చల్ నుంచి నగరంలో, నగర శివార్లలో మేడ్చల్‌కు చెందిన వందల మంది విద్యార్థులు నిత్యం ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేస్తున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ బస్‌పాస్ ఉండటంతో ఆ పాస్‌తో విద్యార్థులు చదవుకోవడానికి కళాశాలలకు నిత్యం ప్రయాణం చేస్తున్నారు. సాధరణంగా ఉదయం వేళల్లో విద్యార్థులకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ప్రయాణసమయం. దీంతో నగరంకు గంట ప్రయాణం ఉండటంతో విద్యర్థులు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు మేడ్చల్ బస్టాండ్‌కు చేరుకుని తమ గమ్యస్థానాలలో ఉన్న కళాశాలలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణం చేస్తున్నారు. – మేడ్చల్

బస్‌పాస్ ఉన్నా రోజు 20 రూపాయలు అవసరమవుతున్నాయి..



ఉదయం, సాయంత్రం వేళల్లో తమ బస్‌పాసులు చెల్లుబాటు అయ్యే ఆర్డినరీ సర్వీసులు లేకపోవడంతో మెట్రో బస్సులలో ప్రయాణంచేసి నిత్యం రూ.20 రూపాయలతో కాంబినేషన్ టికెట్ తీసుకుంటున్నాం. నెలకు కాంబినేషన్ టికెట్ కోసం రూ.600, బస్‌పాస్‌కోసం రూ.450 వెచ్చిస్తున్నాం. నెలకు ప్రయాణం కోసం 1050 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

– ఎస్‌కె అద్నాన్, మేడ్చల్ విద్యార్థి

సీతారామాంజనేయ స్వామి 14వ వార్షికోత్సవం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీ, ఘనపురంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం బి–బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఘనపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజుగౌడ్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూమ్ ఇళ్లను అందజేయాలి



ప్రజాభవన్ వద్ద సింగం చెరువుతండా వాసులు

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సింగం చెరువు తండాలో మొత్తం 176 డబుల్‌బెడ్రూమ్‌లను నిర్మించగా 127 మంది లబ్ధిదారులకు ఇళ్లను అందజేశారు. మిగిలిన 48 మందికి ఇళ్లను ఇవ్వాలని కోరుతూ మంగళవారం ప్రజాభవన్‌లో సింగం చెరువుతండా అధ్యక్షులు పీరు నాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మాజీ సీఎం ఇచ్చిన హమీ మేరకు తండావాసులు, లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్‌లను అందజేయాలన్నారు. గత పదేళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ తండావాసులు నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ శాంతి తదితరులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 6వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టే డ్రైనేజీ పనులను మంగళవారం మేయర్ శాంతి, కార్పొరేటర్ పల్లపు రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, అన్ని కాలనీల్లో మురుగు కాలువలు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, కాలనీవాసులు పల్లపు ఉపేంద్ర, కళావతి, రవీందర్‌గౌడ్, హేమలత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

మల్లాపూర్: నాచారం హెచ్ఎంటీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు వేంకటేశ్వరాచార్యులు అర్చకుల బృందం పర్యవేక్షణలో శ్రీనివాసకల్యాణం కనుల పండువగా జరిగింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి పాల్గొని శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి

బోడుప్పల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నాయని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 28వ డివిజన్‌లో మంగళవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్షయ నిర్మూలన హెల్త్ క్యాంపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో క్షయ వ్యాధి ప్రాణాంతకంగా ఉండేదని, ప్రస్తుతం వ్యాధి నివారణకు పూర్తిస్థాయి మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వాలు కూడా క్షయవ్యాధి రహిత సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. క్షయ వ్యాధి వచ్చినా భయపడాల్సిన అవసరం లేదన్నారు. కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా, కుంభం కిరణ్ కుమార్‌రెడ్డి, నేతలు రాపోలు ఉపేందర్, రామస్వామి, చీరాల జంగయ్య పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మేయర్

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్షలు

- సెంటర్‌ను పరిశీలించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాల గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో 2వ రోజు మంగళవారం గ్రూప్–1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గీతాంజలి ఇంజనీరింగ్ సెంటర్‌లో మొత్తం 936 మందికి గాను 488 మంది పరీక్షకు హాజరయ్యారు. 448 మంది పరీక్షకు హాజరుకాలేదని సెంటర్ అధికారులు తెలిపారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్–1 సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్–1 అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. కీసర సీఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం

బోడుప్పల్: ఎస్.ఐ.ఎస్. కాలనీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దీటి గణేష్, గౌరవ అధ్యక్షుడిగా కొండ అయిలయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఉమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేష్‌యాదవ్, కోశాధికారిగా రవీందర్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ.. కాలనీ ప్రజలందరినీ కలుపుకొని అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. కాలనీ ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ఏకగ్రీవంగా చేసిన ఎన్నికల కమిటీ గౌరవ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



నూతన కమిటీ ప్రతినిధులు

వసతులు లేక వెతలు

- హైస్కూల్, ఇంటర్ కాలేజీల్లో షిఫ్టు సిస్టమ్‌లో డిగ్రీ కాలేజీల మనుగడ
- బోధన, బోధనేతర సిబ్బంది కొరత
- మంచినీటి, మరుగు దొడ్ల పరిస్థితి మరింత అధ్వానం

ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో వేధిస్తున్న సమస్యలు

కాలేజీ విద్య పేద విద్యార్థులకు గగనమవుతోంది. దీంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కార్మిక వాడలు, బస్తీలు, పట్టణాలు, గ్రామాల్లో నివసించే నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేక ..హైస్కూల్, ఇంటర్ విద్యతోనే స్వస్తి చెప్పాల్సిన వస్తోంది. ప్రతి ఏటా జిల్లాలో 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 8 వేల మంది విద్యార్థులు పదోతరగతి పూర్తి చేసి.. ఇంటర్ చదువుకు వెళ్లాల్సి ఉండగా, ప్రభుత్వ రంగంలో సరిపడు ఇంటర్ కాలేజీలు లేకపోవటంతో సగం మంది విద్యార్థులు హైస్కూల్ చదువులతోనే ముగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇంటర్ పూర్తి చేసుకున్న కొద్ది మంది విద్యార్థులు కూడా .. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేక పోవటంతో ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో





మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నాలుగు ప్రభుత్వ ఇంటర్ కాలేజీలు ,రెండు ఎయిడెడ్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో 2,640 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే జిల్లాలోని 228 ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో 1.13 లక్షల మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. జిల్లాలో మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్‌లో చాలీచాలని భవనాల్లో అరకొర సౌకర్యాల నడుమ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. బొల్లారం, అల్వాల్‌లో ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కాలేజీలలో వసతుల పరిస్థితి కూడా అంతంత మాత్రమేనని చెప్పవచ్చు.

15 మండలాలకు 4 మండలాల్లో ఇంటర్ కాలేజీలు

జిల్లాలో 15 మండలాలు ఉన్నాయి. 11 మండలాల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేక పోటంతో స్థానిక విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేదు. శామీర్‌పేట, కీసర , ఘట్కేసర్, మేడిపల్లి, మూడు చింతలపల్లి, ఉప్పల్, కాప్రా, బాచుపల్లి, దుండిగల్, అల్వాల్, బాలానగర్ మండలాల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీంతో విద్యార్థులు పక్క మండలాల పరిధిలోని ప్రభుత్వ కాలేజీల్లో చదువుకోవటమో ..లేక ప్రైవేట్ కాలేజీలను ఆశ్రయించటమో చేయాల్సి వస్తోంది. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.


ఇంటర్ కాలేజీల్లోనే... డిగ్రీ చదువులు

జిల్లాలో నాలుగు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే ..షిఫ్ట్ సిస్టమ్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను కొనసాగుతున్నాయి. చాలీ చాలని వసతుల మధ్య విద్యార్థులు తమ చదువులను నెట్టుకురావాల్సి వస్తోంది. జిల్లాలో ఐదు డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఉప్పల్‌లోని డిగ్రీ కాలేజీ స్థానిక ప్రభుత్వ హైస్కూల్ భవనంలో కొనసాగుతోంది. మల్కాజిగిరి డిగ్రీ కాలేజీ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం షిఫ్ట పద్ధతిలో తరగతులను నిర్వహిస్తున్నారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌లోని డిగ్రీ కాలేజీలు కూడా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం వేళ షిఫ్ట సిస్టమ్‌లో కొనసాగుతున్నాయి. ఈ నాలుగు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మొత్తంగా 1040 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో జిల్లాలో ఇంటర్ పూర్తి చేసిన నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశం లభించకపోవటంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి అప్పోసప్పో చేసి ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో చదుకోవాల్సిన వస్తోంది. మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలం నుంచి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్నారు. అయినా మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి మోక్షం కలుగలేదు.

సమస్యల నడుమ సదువులు

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పలు సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంటర్‌లో కాంట్రాక్టు లెక్చరర్లతో విద్యా సంవత్సరాన్ని నెట్టుకొస్తున్నారు. విద్యార్థులకు కాలేజీల్లో కనీస వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. మంచినీటి కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల పరిస్థితి మరి అధ్వానంగా ఉంది. గంటల తరబడి వేచి ఉంటే తప్ప ..బాత్ రూమ్‌లకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అధ్యాపకులకు కూడా ఈ ఇబ్బందుల నుంచి మినహాయింపు లేదని చెప్పవచ్చు. విద్యుత్ సదుపాయం కూడా సరిగ్గా లేదు. బోధనేతర సిబ్బందిని నియమించకపోవడంతో అక్కడ ఉన్న అధ్యాపకులే అన్ని విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అధికారులకు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చూపిస్తున్న మోజును ప్రభుత్వ కాలేజీలపై చూపకపోవడంతో విద్యార్థులు సకల సమస్యలతో చదువులు కొనసాగించాల్సి వస్తోందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి.

ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. మరుగుదొడ్లు, మూత్రశాలల సరిపడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలి. మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీతోపాటు జూనియర్ కాలేజీలు లేని 11 మండలాల్లో ప్రభుత్వ కాలేజీలను ఏర్పాటు చేయాలి. సమస్యల పరిష్కారానికి పోరాటాలను తీవ్రతరం చేస్తాం.

– రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

బీజేపీ సభ్యత్వ నమోదు



మౌలాలి : బీజేపీ ఆధ్వర్యంలో 137 డివిజన్‌లోని 145 బూత్ నెంబర్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, వీకే మహేష్, ఆర్‌కే శ్రీనివాస్, ఓంప్రకాష్, శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై యువతి ఫిర్యాదు

మల్కాజిగిరి: మానసికంగా, లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై ఓ మహిళ మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి ఏపీఐఐసీ కాలనీకి చెందిన ఎస్ఎస్ ప్రశాంతి ఓ న్యూస్ ఛానెల్‌తో పాటు ప్రైవేటు ఆసుపత్రిని నిర్వహిస్తోంది. మూడేళ్ల క్రితం నీల్ రాజ్ అలియాస్ మామిడాల కనకరాజు పాస్టర్‌తో ఉన్న వివాదాన్ని పరిష్కరించాలని ఆమెను కోరాడు. మధ్యవర్తుల ద్వారా ఆమె ప్రయత్నించినా పనికాకపోవడంతో ఆమెను తరచూ ఫోన్ ద్వారా వేధించేవాడు. ఆమె నిర్వహించే ఆసుపత్రికి ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడేవాడు. గతేడాది రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో అతను వైరల్ చేసిన వీడియోలపై ఫిర్యాదు చేసింది. ఆమెకు మద్దతుగా ఉన్న ఓ మహిళను కూడా బెదిరిస్తూ ఈనెల 7న రాత్రి ఆమె ఇంటికి వచ్చాడు. అదే రోజు ఆమెపై మరో వీడియో వైరల్ చేసి బెదిరించడంతో ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.